జనవరి 1 నుంచి జీవీఎంసీ పరిధిలో ప్లాస్టిక్ పూర్తిగా బ్యాన్ చేస్తున్నట్టు కమిషనర్ వెల్లడి

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూసుకోవాలని సూచన

ప్లాస్టిక్ నియంత్రణకు నగర పౌరులకు అవగాహన కల్పించినా.. కానరాని చర్యలు..

నిషేధం జరిగేనా..?





పాఠశాలకు ప్లాస్టిక్ కవర్లో క్యారేజీ తీసుకెళ్తున్న పిల్లలు

డాబాగార్డెన్స్: తేలిగ్గా ఉంటుందన్న ఆలోచనలో జరగబోయే అనర్థాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. 40 మైక్రాన్లలోపు పాలిథిన్ కవర్ల వినియోగం మళ్లీ మామూలైపోయింది. అధికారులు పెద్ద ఎత్తున్న తనిఖీలు నిర్వహిస్తున్నా.. చాటుమాటున ప్లాస్టిక్ వినియోగం సాగుతోంది. జరిమానాలు విధిస్తున్నా.. ప్రజల్లో అవగాహన రావడం లేదు. ప్లాస్టిక్ వల్ల ఎన్నో అనర్థాలు ఉన్నాయన్నా.. ఇంకా ప్లాస్టిక్‌ను విడనాడడం లేదు. ఫలితంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్లాస్టిక్ నియంత్రణకు చేపట్టిన చర్యలు శూన్యంగానే కనిపిస్తున్నాయి. సాక్షాత్తు కలెక్టర్ హరీంధిరప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ జనవరి 1 నుంచి జీవీఎంసీ పరిధిలో ప్లాస్టిక్ పూర్తిగా బ్యాన్ చేస్తున్నట్టు ప్రకటించారు. అందుకు సంబంధించి సచివాలయ సిబ్బందితో నగర పౌరులకు ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. అంతే కాక ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయం చూసుకోవాలని సూచించారు కూడా. కానీ ఆ దిశగా చర్యలు లేవు. ఫలితాలు రావడం లేదు.

అనర్థాలెన్నో..

పాలిథిన్ కవర్లు మట్టిలో కలవడానికి వెయ్యి సంవత్సరాలు పడుతుంది. మట్టికి మనిషికి మధ్య అడ్డుగోడలా పాలిథిన్ నిలుస్తుంది. అటువంటి ప్లాస్టిక్‌ను విడనాడకపోతే భవిష్యత్ తరాల మనుగడ ప్రశ్నార్థకమవుతుందని పర్యావరణవేత్తలు నెత్తీనోరూ కొట్టుకుంటున్నారు. ఇకనైనా మన బాధ్యతగా ప్లాస్టిక్‌ను విడనాడాలి.

టిఫిన్ కొట్టుకు వెళ్లినా..

సార్.. నాలుగు ఇడ్లీలు కట్టండి.. సార్ ఫుల్‌మీల్స్ పార్శిల్ చేయండి.. బాబూ డజన్ అరటిపళ్లు ఇవ్వు.. రూ.10 పువ్వులు కట్టు.. ఇలా చెప్పుకుంటూ పోతే ఏ వస్తువు కొనాలన్నా.. కొనుగోలు చేసిన వస్తువులు ఇంటికి తీసుకెళ్లాలన్నా ఇటు కొనుగోలుదారులు.. అటు విక్రయదారులు ప్లాస్టిక్ పైనే ఆధారపడుతున్నారు.



ప్లాస్టిక్ కవర్లో టిఫిన్ తీసుకెళ్తున్న యువకుడు

ప్రజల్లో స్పందనతోనే సాధ్యం..

పర్యావరణ ఉపయుక్తమైన సంచులు తప్ప పాలిథిన్ సంచులు వాడకూడదన్న ఆలోచన ప్రజల మనస్సుల్లోంచి వస్తే తప్ప ఈ సమస్యను అధిగమించలేం. ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చినప్పుడే పర్యావరణం పరిరక్షించబడుతుంది. అందరూ కలిసి రాకపోతే పాలిథిన్ రక్కసి మనల్ని మింగేయడం ఖాయం అని ఎన్విరాన్‌మెంట్ లవర్స్ వాపోతున్నారు.



ఆఫీసుకు ప్లాస్టిక్ కవర్లో క్యారేజీ తీసుకెళ్తున్న ఉద్యోగి

పట్టుబడితే జరిమానా తప్పదు..

తక్కువ మైక్రాన్లు ఉన్న పాలిథిన్ కవర్లను వాడుతూ పట్టుబడితే జరిమానా విధిస్తాం. పాలిథిన్ కవర్ల వినియోగం నిషేధించామని ఎప్పటికప్పుడు ప్రచారం చేస్తున్నాం. పూర్తి స్థాయిలో చర్యలు తీసుకునే దిశగా పని చేస్తున్నాం.

– మల్లయ్యనాయుడు, జోన్-4 జోనల్ కమిషనర్

పర్యావరణ సమతుల్యతతోనే..



పర్యావరణ సమతుల్యతతోనే స్వచ్ఛ విశాఖ నిర్మాణం జరుగుతుంది. ప్రపంచ వ్యాప్తంగా ప్లాస్టిక్ మహమ్మారి మానవాళితో పాటు జల, చర జీవ రాశులకు ఎంతో హాని కల్గిస్తుంది. అందుకు ప్లాస్టిక్ భూతాన్ని విశాఖ నగరం నుంచి తరిమి వేయాలి. నగరంలో ఎప్పటికప్పుడు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిర్మూలిస్తున్నాం. అందుకు విరుద్ధంగా ప్లాస్టిక్ తయారీ, నిల్వ, సరఫరా, రవాణా, విక్రయం, వాడకం వంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా గుడ్డ, నార వస్తువులు ఉపయోగించాలి. అందుకు సంబంధించి నగర ప్రజలకు జూన్ 5 నుంచి ప్లాస్టిక్ నిషేధంపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ వస్తున్నాం. ప్లాస్టిక్ నిర్మూలనకు రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు, స్వచ్ఛ భారత్ అంబాసిడర్లు, విద్యా, వ్యాపార సంస్థలు, నగర ప్రజలు స్వచ్ఛందంగా కృషి చేస్తున్నప్పటికీ.. ఇంకా కొంత మంది వ్యాపారస్తులు అక్కడక్కడ నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తున్నారు. ప్లాస్టిక్‌ను విడనాడి నగర సుందరీకరణకు నగర ప్రజలు సహకరించాలి.

–సంపత్‌కుమార్, కమిషనర్, జీవీఎంసీ

నేడు పాలకవర్గ ఎన్నికలు

మహారాణిపేట: రెవెన్యూ డిపార్ట్‌మెంట్ నాన్ గెజిటెడ్ ఎంప్లాయీస్ కో–ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్‌కు బుధవారం ఎన్నికలు జరగనున్నాయి. 890 మంది సభ్యులున్న ఈ సొసైటీ పాలకవర్గ పోస్టులకు 18 మంది పోటీ పడుతున్నారు. రెవెన్యూ శాఖలో పని చేస్తున్న ఉద్యోగులు, పదవీ విరమణ చేసిన వారు కూడా ఈ పోటీలో ఉన్నారు. బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. విశాలాక్షినగర్ గీతాంజలి కమ్యూనిటీ హాల్లో పోలింగ్ కోసం సహకార శాఖ అధికారి, ఎన్నికల అధికారి త్రినాథ్ ఏర్పాట్లు చేశారు. మొత్తం 13 మంది డైరెక్టర్లు ఎన్నిక అవుతారు. వీరు అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకుంటారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్‌కు చక్కటి స్పందన



క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అల్లిపురం: కొబ్బరితోట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. అగనంపూడి హోమీబాబా క్యాన్సర్ రీసెర్చ్ సెంటర్ డాక్టర్ నమిత తన సిబ్బందితో కలిసి సుమారు 50 మందికి పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలలో ఏడుగురికి క్యాన్సర్ కారకాలు ఉన్నట్లు గుర్తించినట్లు డాక్టర్లు తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన క్యాన్సర్ స్క్రీనింగ్‌కు కొబ్బరితోట, అల్లిపురం, నేరెళ్లకోనేరు, అచ్చియ్యమ్మపేట, వెంకటేశ్వరమెట్ట ప్రాంతాల నుంచి మహిళలు, పురుషులు పాల్గొని టెస్టులు చేయించుకున్నారు.

క్లుప్తంగా

సాయుధ దళాల పతాక నిధికి విరాళం



కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న డాక్టర్ గిరివర్మ, డాక్టర్ చంద్రశేఖర్

మహారాణిపేట: సాయుధ దళాల పతాక నిధికి లయన్ డాక్టర్ ఎం.ఎస్.గిరివర్మ రూ. లక్ష చెక్కును వెటరన్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ చంద్రశేఖర్ ద్వారా కలెక్టర్ ఎం.ఎన్. హరిందిర ప్రసాద్‌కి మంగళవారం అందజేశారు. కలెక్టర్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. జిల్లా సైనిక సంక్షేమ అధికారి డాక్టర్ జి. సత్యానందం, అడ్వకేట్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో అనుబంధ సంఘాల నియామకాలు



బయోడేటాలు స్వీకరిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల నూతన నియామకానికి మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అభ్యర్థుల నుంచి బయోడేటాలు స్వీకరించారు. ఆశీల్‌మెట్టలో గల తన కార్యాలయంలో మంగళవారం పార్టీ శ్రేణులు వాసుపల్లికి బయోడేటాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం అహర్నిశలు కష్టపడే వారికి వైఎస్సార్‌సీపీలో గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీకి పూర్వం వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేయాలన్నారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జనవరి నుంచి కార్యకర్తలతో మమేకమయ్యేందుకు నియోజకవర్గాల వారీగా హాజరు కానున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో పీతల వాసు, ముత్తాబత్తుల రమేష్, దళమంతుల మాణిక్యాలరావు, సనపల రవీంద్ర భరత్, దళమంతుల చిన్ని, వాసుపల్లి రాజు, బీశెట్టి ప్రసాద్, కోన శంకర్, వడ్డాది దిలీప్, కె. సతీష్, రామలక్ష్మి, దేవర మహేష్, సాగర్, షకీల్, రఫీ, తాడి రవితేజ, వాసుపల్లి బంగారమ్మ, వైజాగపటం పాత్రుడు, ఆకుల శ్యామ్, గనగల్ల రామరాజు, చింతకాయల వాసు తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా కార్యకర్త కిలాని మృతి



కిలాని మూర్తి

డాబాగార్డెన్స్: సోషల్ మీడియా కార్యకర్త కిలాని త్రిమూర్తులు (మూర్తి యాదవ్) అనారోగ్యంతో మృతి చెందారు. 29వ వార్డు రామజోగిపేట ప్రాంతంలో నివసిస్తున్న త్రిమూర్తులు గత కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. డయాలసిస్ చేయించుకుంటున్న ఆయన సోమవారం మృతి చెందారు. అతని మృత దేహానికి వార్డు నాయకుడు పీతల వాసు నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

13న హనుమత్ వ్రతం

మహారాణిపేట: మెయిన్‌రోడ్డులో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవాలయంలో ఈనెల 13న హనుమత్ వ్రతం నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో అల్లు జగన్నాథం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 6 గంటలకు శ్రీఆంజనేయస్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ పూజలో పాల్గొనే భక్తులు రూ. 216 దేవస్థానంలో చెల్లించాలని, రుసుం చెల్లించిన వారికి లడ్డూ, పూలిహోర, సింధూరం అందజేస్తామని తెలిపారు.

వారిజ ఆశ్రమానికి రూ.3లక్షల విరాళం

సీతమ్మధార: క్షత్రియ సంక్షేమ సమితి తరఫున భీమిలిలో గల వారిజ ఆశ్రమానికి రూ.3లక్షల విరాళం ప్రకటించారు. సీతమ్మధారలోని క్షత్రియ సంక్షేమ సమితి కార్యాలయంలో మంగళవారం చినజీయర్ స్వామి అనుగ్రహభాషణం చేశారు. ఈ సందర్భంగా చినజీయర్ స్వామికి విరాళం అందజేశారు. అలాగే సమితి చైర్మన్ ఎం.ఎస్.ఎన్.రాజు రూ.1,01,116, ఎన్.గౌతం రాజు రూ.20,116 విరాళంగా అందజేశారు.

జవాన్ కుమారుడి ఆశయానికి వాసుపల్లి అండ

ఎస్ఎస్‌బీ ట్రైనింగ్‌కు రూ.15 వేల ఆర్థిక సాయం



అవినాష్‌కు ఆర్థిక సాయం చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: జవాన్ కుమారుడి ఆశయానికి మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ బాసటగా నిలిచారు. ఆశీల్‌మెట్టలో గల తన కార్యాలయంలో మంగళవారం కాగితాల వారి వీధికి చెందిన కొండపు శ్రీనివాస్ (ఆర్మీ), కొండపు అనురాధ దంపతుల కుమారుడు కొండపు అవినాష్‌కు ఎస్ఎస్‌బీ ట్రైనింగ్ కోసం రూ.15 వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ దేశ రక్షణలో టెర్రరిస్టుల చేతిలో వరుసగా 5 బుల్లెట్లు తగిలి అసువులు బాసిన కొండపు శ్రీనివాసరావు కుమారుడు అవినాష్ తండ్రి ఆశయాన్ని నెరవేరుస్తూ నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ) పరీక్షల్లో అర్హత సాధించాడన్నారు. దేశం కోసం ప్రాణాలు పణంగా పెట్టిన తండ్రి అడుగుజాడల్లో కుమారుడు కూడా దేశ రక్షణ రంగంలో చేరుదామన్న ఆశయానికి అభినందనలు తెలుపుతున్నానన్నారు. బెంగళూరులో సర్వీస్ సెలక్షన్ బోర్డు (ఎస్ఎస్‌బీ) శిక్షణకు అవసరమైన ఫీజును అందజేసినట్టు తెలిపారు. పట్టుదల, కృషితో కోరుకున్న లక్ష్యాన్ని సాధిస్తున్న అవినాష్ ఉన్నత స్థాయికి చేరుకోవాలని అభిలషించారు. కష్టపడి చదివిస్తున్న తల్లిదండ్రుల నమ్మకాన్ని నేటి యువత మంచి లక్ష్యం సాధించడం ద్వారా నిలబెట్టాలన్నారు. జవాన్ల కుటుంబాలకు అందరూ చేయూత ఇవ్వాల్సిన అవసరం ఉందని, ముఖ్యంగా ప్రభుత్వం ముందుకు వచ్చి ఆదుకోవాలని వాసుపల్లి సూచించారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 49 దరఖాస్తులు



ఇన్‌చార్జి ఆర్‌డీవో జయరామ్‌కు దరఖాస్తు అందజేస్తున్న యువకుడు

మహారాణిపేట: రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను అప్‌డేట్ చేస్తున్నామని విశాఖ డివిజన్ ఇన్‌చార్జి ఆర్‌డీవో జయరామ్ అన్నారు. మంగళవారం 30వ వార్డు సాలిపేట సచివాలయం పరిధిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తులను ఉచితంగా స్వీకరిస్తున్నామన్నారు. వీటిని ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసి రెండు మూడు రోజుల్లో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్నామన్నారు. మహారాణిపేట ఇన్‌చార్జి తహసీల్దార్ జిలానీ మాట్లాడుతూ ఈ సదస్సులను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. వినియోగదారుల సేవల నిమిత్తం అధికారులు పూర్తి స్థాయిలో పని చేస్తారని తెలిపారు. మొత్తం 49 దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కొడూరు అప్పలరత్నం, వార్డు దేశం నాయకులు పెంటపల్లి సత్యనారాయణ, యర్రబిల్లి ప్రభాకరరావు, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాలు 9వ రోజు మంగళవారం కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని విశేష పూజలు జరిపారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, అమ్మవారికి సహస్రనామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు సర్వదర్శనం, 6 నుంచి రాత్రి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ జరిపారు. అష్టదళ పద్మారాధనలో, త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే ఆసక్తి గల భక్తులు మార్గశిర గురువారాల్లో రూ.7,500, గురువారం మినహా మిగిలిన రోజుల్లో రూ.2,500 చెల్లించి పూజలో పాల్గొనవచ్చని ఈవో శోభారాణి తెలిపారు.

మండపంలో వైదిక కార్యక్రమాలు..

ఉదయం 8 నుంచి 10 గంటల వరకు శ్రీచక్రనవావర్ణార్చన, లక్ష్మీహోమం, మార్గశిర మాస విశేష కుంకుమార్చన, అష్టోత్తర కుంకుమార్చనలు, వేదపారాయణ, సప్తశతీ పారాయణ, మహా విద్యాపారాయణ భక్తిశ్రద్ధలతో జరిపారు. ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు మార్గశిర మాస విశేష కుంకుమార్చనలు చేశారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు వేదపారాయణ, మహా విద్యాపారాయణ జరిపారు. మధ్యాహ్నం వందలాది మంది భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, వేదపండితులు, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే ఇలవేల్పు



ఇంటి ముంగిటకు ఇలవేల్పు వచ్చి నిల్చున్నట్లు ఉందీ కదూ ఈ చిత్రం చూస్తుంటే.. స్వయంగా షిర్డీ సాయినాథుడే ఎదుట ప్రత్యక్షమైనట్లు అనిపిస్తోంది. జీవీఎంసీ 29వ వార్డు పరిధి దండుబజార్ రోడ్డులో గల సాయిబాబా గుడిలో ఈ విగ్రహాన్ని నిర్వాహకులు ఏర్పాటు చేశారు. చూసిన వారంతా సాయిబాబాయే స్వయంగా వచ్చి ఎదుట నిలబడినట్టు ఉందని అంటున్నారు. ఈ విగ్రహాన్ని వీక్షించేందుకు పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు. – డాబాగార్డెన్స్

కిడ్నీ బాధితుడికి వాసుపల్లి చేయూత



వాసుపల్లికి కృతజ్ఞతలు తెలుపుతున్న బాధిత దంపతులు

డాబాగార్డెన్స్: నియోజకవర్గానికి చెందిన ఓ కిడ్నీ బాధితుడికి మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ సహకరించి పునర్జన్మ ప్రసాదించారు. ఆశీల్‌మెట్టలో గల తన కార్యాలయంలో బాధిత దంపతులు వాసుపల్లిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలుపుకున్నారు. జీవీఎంసీ 29వ వార్డు ఆంథోనీనగర్ కలకత్తా వీధిలో నివసించే వారమని పోతున చంద్రశేఖర్, షర్మిల దంపతులు తెలిపారు. తమకు ఇద్దరు ఆడపిల్లలన్నారు. తన భర్త రెండు కిడ్నీలు పాడైపోవడంతో చనిపోయే స్థితికి వచ్చారని, మూడేళ్లగా పిల్లలను బంధువులకు అప్పజెప్పి తన భర్తను బతికించుకోవడానికి ఎంతో మంది కాళ్లు పట్టుకున్నానని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ ఎలాంటి ఉపయోగం లేకపోయిందన్నారు. ఆ సమయంలో వార్డు నాయకుడు పీతల వాసు సహకారంతో వాసుపల్లి గణేష్‌కుమార్‌ను కలిశానన్నారు. వెంటనే కేజీహెచ్‌లో కిడ్నీ మార్పిడికి జరిగే మెడికల్ బోర్డుతో మాట్లాడి, వాసుపల్లి ఇచ్చిన లేఖతో తన భర్త పునర్జన్మ అందుకున్నారని షర్మిల ఆనందం వ్యక్తం చేశారు. ఆరోగ్యం కుదుటపడిన తన భర్తతో కలిసి వాసుపల్లిని కలవడం ఎంతో ఆనందం కల్గించిందని తెలిపారు. పిల్లలు తన వద్దకు చేరుకున్నారని, ప్రస్తుతం కుటుంబమంతా ఆనందంగా ఉండేందుకు వాసుపల్లి గణేష్‌కుమారే కారణమని ఆనందం వ్యక్తం చేశారు. ఆయన రుణం తీర్చుకోలేమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీతల వాసు, సనపల రవీంద్ర భరత్, ముత్తాబత్తుల రమేష్, మహేష్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

మనసు దోచిన మధుర గీతాలు



జ్యోతి ప్రజ్వలన చేసి సినీ సంగీత విభావరిని ప్రారంభిస్తున్న అతిథులు

డాబాగార్డెన్స్: కేవీఆర్ స్వర్ సంగీత్ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆద్యంతం అలరించింది. వీరేంద్ర యాదవ్, స్వర్ణ పాడిన ఇదేదో గోలగా ఉంది, కోటేశ్వరరావు, శైలజా పాడిన ఏం వానో తరుముతున్నది, మహ్మద్ ఖాన్, రంజిత పాడిన రబ్బరు గాజులు, చెన్నా తిరుమలరావు, స్వర్ణ పాడిన ఆకులు పోకలు ఇవ్వొద్దు, పావనితో పాడిన ఏమిటో ఇది ఏమిటో, శ్రీనివాస్, రాధ పాడిన భలేగా ఉందిరో, బాలకృష్ణ రాధ పాడిన అందాలలో అహో వంటి గీతాలు, ప్రభాకర్, ఆశాలత, వాసు, ఎమ్మెస్ మాధవ్, మెలోడీ సత్యనారాయణ, ఎస్ఎస్ఎన్ రాజు, చిరంజీవి, చంద్రకళ, ఆంజనేయరెడ్డి ప్రజాదరణ పొందిన గీతాలతో సంగీత రస హృదయాల్ని కట్టి పడేశారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు వీరేంద్ర యాదవ్‌ను కళా సంస్థల అధ్యక్షుడు కొణతాల రాజు, జి. త్యాగరాజు, వివిధ కళా సంస్థల అధినేతలు ఘనంగా సత్కరించారు. సినీ సంగీతంపై ఉన్న మక్కువతో కేవీఆర్ స్వర సంగీత్ సంస్థ ఏర్పాటు చేశానని, ఔత్సాహిక గాయనీ గాయకులకు అవకాశం కల్పిస్తున్నామని వీరేంద్ర యాదవ్ తెలిపారు.

పోరాటంతోనే విశాఖ ఉక్కును కాపాడుకుంటాం



దీక్షా శిబిరంలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

సీతమ్మధార: విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణ కోసం జరుగుతున్న నిరాహార దీక్షలు మంగళవారం 1316వ రోజుకు చేరుకున్నాయి. సీఐటీయూ మధురవాడ జోన్ కమిటీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ జోన్ ప్రధాన కార్యదర్శి పి. రాజుకుమార్ మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం చేయడం కోసం కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను స్టీల్ కార్మికులు, ప్రజా సంఘాల ఐక్య వేదిక ప్రతిఘటిస్తున్నట్లు తెలిపారు. విశాఖ ఉక్కును రక్షించుకునే పోరాటంలో ప్రజలు కూడా భాగస్వాములవుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ప్లాంట్ రక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలా కాకుండా బీజేపీ ఒత్తిడికి లొంగిపోతే ప్రజా వ్యతిరేకతను ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. ఈ దీక్షలో సీఐటీయూ కార్యకర్తలు డి.అప్పలరాజు, జి. చిన్నారావ్, ఎస్. శ్రీనివాసరావు, ఎం.రాజు, జె. ఆర్యులు, ఎస్. సూరప్పాడు, సన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో సమస్యల పరిష్కారానికి చర్యలు



అర్ధరాత్రి తనిఖీల్లో రోగి సహాయకుడితో మాట్లాడుతున్న డాక్టర్ శివానంద్

మహారాణిపేట: రాత్రి వేళల్లో రోగుల సేవలకు ఇబ్బందులు కలగడం, వైద్యులు సకాలంలో రాకపోవడం, నర్సులు అందుబాటులో లేకపోవడం, సెక్యూరిటీ సిబ్బంది అతి ప్రవర్తన, ఎక్కువ మంది సిబ్బంది గైర్హాజరు వంటి ఆరోపణలు కేజీహెచ్‌లో వెల్లువెత్తుతున్న నేపథ్యంలో సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ రంగంలోకి దిగారు. సోమవారం అర్ధరాత్రి తనిఖీల్లో అనేక లోపాలు గుర్తించడంతో వాటిని చక్కదిద్దే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. క్యాజువాలిటీ, అత్యవసర విభాగం, యాంటీ మెడికల్ కేర్ యూనిట్(ఏఎంసీ), గైనిక్ వార్డుల్లో తనిఖీలు నిర్వహించి లోపాలు గుర్తించారు. అయితే ఎవరిపై చర్యలు కాకుండా మొదటి హెచ్చరిక జారీ చేశారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమగ్ర పర్యవేక్షణకు సూపరింటెండెంట్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్లు, డిప్యూటీ చీఫ్ రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్లు (డీసీఆర్ఎంవోలు) రోజువారీ రాత్రి విధులను పర్యవేక్షించాలని నిర్ణయించారు. నర్సింగ్ సేవలు, భద్రత, పారిశుధ్యంతో సహా రోగి సంరక్షణ విషయాలను పరిగణనలోకి తీసుకుంటారు.

ఇతరుల హక్కులను గౌరవించాలి



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మహిళా సంఘాల ర్యాలీ

అల్లిపురం: సమాజంలో ప్రతి ఒక్కరు ఇతరుల హక్కులను గౌరవించాలని లీగల్ సర్వీసెస్ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎంవీ శేషమ్మ అన్నారు. ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మహిళా సంక్షేమం, శిశు సంక్షేమ శాఖ, యాక్సెస్ టు జస్టిస్ ఫర్ చిల్డ్రన్ అప్‌హోల్డ్ ఆర్గనైజేషన్, ప్రభుత్వ మహిళా కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవ హక్కుల గురించి తెలుసుకుని స్వేచ్ఛగా జీవించాలన్నారు. ముందుగా విద్యార్థినులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ జయలక్ష్మి, ఏడీసీపీ ఎం.మోహనరావు, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ జి. డేవిడ్ రాజు, మర్రి సత్యనారాయణ, శరణ్య, శారద పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్‌లో..

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం అధికారి మాణిక్య కుమారి ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ వేడుకలు ప్రారంభించి మాట్లాడారు. అనంతరం మానవ హక్కులపై స్ఫూర్తిదాయకమైన సందేశాలు, నినాదాలతో కూడిన ప్లకార్డులు పట్టుకుని మానవహారంగా ఏర్పాడ్డారు. డాక్టర్ ప్రవీణ, వెంకట్, హరిణి, రోసినా జార్జ్ మౌసమి, శంకర్, మేరీ, డాక్టర్ పి.కె.జయలక్ష్మి, డాక్టర్ రాజేష్‌ప్రసాద్ పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న సీనియర్ సివిల్ జడ్జి ఎం. వెంకట శేషమ్మ, ముఖ్య అతిథులు



సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు